క్లుప్తంగా

పిల్లలకు విధిగా వ్యాక్సినేషన్ వేయించాలి



వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ కొండారెడ్డి

సీఎస్‌పురం(పామూరు): తల్లిదండ్రులు తమ పిల్లలకు విధిగా వ్యాక్సినేషన్ వేయించాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని గుమ్మినేనిపల్లి పాఠశాలలో వైద్యసిబ్బంది నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని తల్లిదండ్రులు ఉపయోగించుకుని క్రమం తప్పకుండా పిల్లలకు వ్యాక్సిన్ వేయించాలన్నారు. ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు, ఆల్‌బెండజోల్ మాత్రలు పిల్లలతో మింగించాలని సూచించారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

టంగుటూరు: గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్సై నాగమల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకునే వారు ముందుగా పోలీస్, రెవెన్యూ, విద్యుత్‌శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాల్లో శబ్ద యంత్రాలను రాత్రి 10 గంటల తర్వాత వినియోగించరాదని సూచించారు.

పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండండి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న డీపీఓ

జరుగుమల్లి(సింగరాయకొండ): గ్రామాల్లో పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండటంతో పాటు పొడిచెత్త, తడిచెత్త సేకరణ వేర్వేరుగా సేకరణలో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని డీపీఓ జి.వెంకట నాయుడు పంచాయతీ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో బుధవారం చెత్త సేకరణ కార్యక్రమాన్ని డీపీఓ స్వయంగా పర్యవేక్షించారు. తడిచెత్త, పొడిచెత్తపై మరింత అవగాహన కల్పించేందుకు కరపత్రాలను ప్రజలకు అందజేసారు. గ్రామాల్లో తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనపై అలసత్వం వద్దని సూచించారు. డిప్యూటీ ఎంపీడీఓ జీవీ కామేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి విద్యుల్లత పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



గురుకుల పాఠశాలలో ప్రకృతి వ్యవసాయ పనులు పరిశీలిస్తున్న డీపీఎం

కొండపి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ద్వారా ఆరోగ్యానికి మేలు కలుగుతుందని డీపీఎం సుభాషిణి అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయనాల ద్వారా పండించిన పంటలు తినటం వల్ల ఆరోగ్యానికి హానికరమన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు కూరగాయలు తినడం వలన విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని హాస్టల్లో కూరగాయల ఖర్చు కూడా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. డీపీఎం సిబ్బంది, ఎంటీ ఎస్తేరు రాణి, యూనిట్ ఇన్‌చార్జిలు రంజిత్, మందాకిని, మాధవ, ఐసీఆర్పీలు ఏడుకొండలు, జోత్స్న, గౌతమి విజయలక్ష్మి తిరుమల మాలకొండయ్య పాల్గొన్నారు.

అక్రమంగా బాణసంచా విక్రయిస్తే చర్యలు



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

కొండపి: దుకాణదారులు ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్సై ప్రేమ్‌కుమార్ అన్నారు. స్థానికంగా పలు దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. వినాయకచవితి పండుగ సమీపిస్తున్న తరుణంలో అక్రమంగా బాణసంచా విక్రయించరాదని సూచించారు. ఎవరైనా బాణసంచా విక్రయిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

దోమల నివారణపై ప్రత్యేక డ్రైవ్

హనుమంతునిపాడు: దోమల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం 14 హెల్త్ క్లీనిక్ పరిధిలో ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఇంటింటికి తిరిగి దోమల నివారణపై తీసుకోవాల్సిన చర్యలు, దోమ వల్ల సోకే వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యులు దార్ల సందీప్, సూపర్‌వైజర్లు బాలు, పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీలు, నర్సులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



బురద, చిత్తడి మయంగా డిపోలో గ్యారేజ్‌కు వెళ్లే దారి



గోతుల మయంగా డిపో ప్రధాన రహదారులు



నిరుపయోగంగా మహిళా టాయిలెట్స్

- అధ్వానంగా కనిగిరి ఆర్టీసీ డిపో
- శిథిలావస్థకు చేరిన డిపో భవనం..
- కందుకూరు రూట్ ప్లాట్‌ఫారం గుంతలమయం

ఆదాయం ఫుల్.. వసతులు నిల్..

కనిగిరిరూరల్:

జిల్లాలో ఐదు ఆర్టీసీ డిపోల్లో కనిగిరి డిపో ఆదాయంలో ముందంజలో ఉంటుంది. అయితే ఇంత ఆదాయం ఉన్న ఈ డిపోలో కనీస వసతులు కరువయ్యాయి. ప్రస్తుతం కనిగిరి ఆర్టీసీ డిపోలో 113 బస్సులు ఉన్నాయి. నిత్యం వేలాది మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారు. రాత్రి 12 గంటలకు కూడా డిపో నుంచి విజయవాడకు బస్సు సౌకర్యం ఉంటుంది. తిరిగి వచ్చే బస్సులు రాత్రి 2 గంటల వరకు వస్తుంటాయి. మళ్లీ తెల్లవారు జామున 3-30 గంటల నుంచి విజయవాడ బస్సులు బయలుదేరుతాయి. అంటే నిత్యం డిపోలో రాక పోకలు జరుగుతూనే ఉంటాయి. అత్యధికంగా కనిగిరి టు విజయవాడ 47 సర్వీసులు నడుస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రం, రెవెన్యూ డివిజన్ కేంద్రం కావడంతో ఇటీవల ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. ప్రధానంగా కనిగిరి- కందుకూరు, కనిగిరి- పొదిలి, కనిగిరి- ఒంగోలు, విజయవాడ రూట్‌లలోని బస్సుల్లో రాక పోకలు రద్దీగా ఉంటాయి.

శిథిలావస్థకు చేరిన డిపో భవనం..

జిల్లాలోని అతి పురాతన డిపోల్లో కనిగిరి ఒకటి. 1979 అప్పటి రోడ్డు రవాణ శాఖ మంత్రి వెంగళరెడ్డి దీన్ని ప్రారంభించారు. ఆదాయంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచి అనేక మార్లు అవార్డులు పొందింది. అయితే రాష్ట్ర రోడ్డు రవాణ శాఖ అధికారులు, ప్రభుత్వం ఈ డిపోపై దృష్టి పెట్టడంలేదు. డిపో భవనం పాతది కావడంతో భవనాల్లోని గదుల్లో వర్షం వస్తే అక్కడక్కడ నీరు కారే పరిస్థితి. అంతేగాక తరచు మరమ్మతులు చేస్తున్నా.. భవనాలు కిటికీలు గదులు, బీటలు వారుతున్నాయి. భవనం పై భాగన ఒక వైపు పూర్తిగా ప్రహారీ లాంటి గోడ ఊడిపోయింది. కందుకూరు పాయింట్ సమీపంలో డిపో స్లాబ్ పోర్టికో పెచ్చులూడి రాలుతున్నాయి.

అధ్వాన్నంగా అంతర్గత రోడ్లు..

డిపోకు ప్రధానంగా మూడు ద్వారాలు ఉన్నాయి. రెండు ద్వారాల ద్వారా బస్సుల రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఈ రెండు రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారాయి. సిమెంట్ రోడ్డు గోతులమయంగా మారి దర్శనమిస్తున్నాయి. డిపోలో ప్రయాణికులకు వసతుల కల్పన అంతంత మాత్రమే. తాగునీటి సౌకర్యం సక్రమంగా లేదు. డిపోలో రవాణ శాఖ ఉద్యోగ సిబ్బంది సుమారు 550 మంది వరకు ఉన్నారు. విశ్రాంతి గదుల్లో సరైన వసతులు లేక అల్లాడుతున్నట్లు ఉద్యోగులు వాపోతున్నారు. నిత్యం ప్రయాణికుల రద్దీతో కన్పించే డిపోలోని కందుకూరు ప్లాట్‌ఫాం గోతులమయంగా మారింది. పొరపాటున ప్రయాణికులు గుంతలో కాలు పెడితే విరిగినట్లే.. వర్షం పడితే ప్లాట్‌ఫారం వద్ద చిత్తడిమయం, బురదమయం. దీంతో ప్రయాణికులు పడే అవస్థలు వర్ణణాతీతం. అధికారులు, ఆర్టీసీ యాజమాన్యం కనీస చర్యలు చేపట్టకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అంతేగాక గ్యారేజ్‌లోకి వాహనాలు వెళ్లే రోడ్డు, గ్యారేజ్ లోపల పారిశుధ్యం అధ్వాన్నంగా తయారయ్యాయి. చిన్నపాటి వర్షం కురిసినా గ్యారేజీలోకి నడక చేయాలంటే అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గ్యారేజ్ సిబ్బందికి తాగునీటి, తదితర మౌలిక వసతులు కరువైయ్యాని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకునేదెవరు..?

ప్రయాణికులకు, ఉద్యోగులకు డిపో ఆవరణలో ప్రత్యేకించి మహిళల కోసం స్వచ్ఛభారత్ నిధులతో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారి దర్శనమిస్తున్నాయి. డిపో ఆవరణలో చిల్లచెట్లు విపరీతంగా పెరిగాయి. దీంతో రాత్రి పూట డిపోలోకి వచ్చే ప్రయాణికులు ప్రత్యేకించి మహిళా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. ప్రస్తుతం పెరిగిన రద్దీ, ప్రయాణికుల రాకపోకలకు అనుకూలంగా చాలా అభివృద్ధి చేయాల్సి ఉంది. ప్రత్యేకించి మహిళా రక్షణలో భాగంగా డిపోలో ప్రస్తుతం ఉన్న వెలుతురు కాకుండా డిపోకు మూడు వైపులా డిపో మధ్యలో హైయ్యర్ పోల్ ఫ్లడ్ లైట్స్‌లను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో డిపోలో జరిగిన సంఘటలను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ యాజమాన్యం, అధికారులు తక్షణ చర్యగా డిపోలో మహిళా రక్షణ చర్యలు చేపట్టాలని మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు కోరుతున్నారు.



పెచ్చులు ఊడిన డిపో భవనం..



అధ్వానంగా కందుకూరు ప్లాట్ ఫారం



పిచ్చి చెట్లతో నిండిన డిపో ఆవరణ

మోసానికి బాబు బ్రాండ్ అంబాసిడర్

కొండపి: మోసానికి సీఎం చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని కె. ఉప్పలపాడులో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాకా పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు ముందంజలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అరకొరగా అమలు చేస్తూ ప్రజలను నిలువునా చేస్తున్నారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకాన్ని తల్లికి వందనంగా మార్చి దీనికి సృష్టికర్త లోకేష్ అంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు కల్పిస్తామని చెప్పి ఇప్పుడు కేవలం కొన్ని బస్సులకు పరిమితం చేయడం మహిళలను మోసం చేయడమేనని అన్నారు. హామీలు అన్నీ అమలు చేయమని ప్రతిపక్షం అడుగుతుంటే ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటివరకు ఒక్క కొత్త పెన్షన్‌ను మంజూరు చేయలేదని, ఆ హామీని కూడా అమలు చేశామని చెప్పడం చంద్రబాబుకే సాధ్యమన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వకుండా యువతను మోసం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శంకర్‌రెడ్డి, మండల యువజన విభాగం ప్రధాన కార్యదర్శి అశోక్‌వర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ డాకా విజయలక్ష్మి, గ్రామ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కె.ఉప్పలపాడులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నేతలు

30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలి



ఏపీటీఎఫ్ సంఘ సభ్యత్వాలు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

హనుమంతునిపాడు: 12వ పీఆర్‌సీ కమిటీని వెంటనే నియామకం చేసి 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని, ఉద్యోగ ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపులు వెంటనే పూర్తి చేయాలని ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ సుబ్బయ్య, జి.శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని హనుమంతునిపాడు, కొండారెడ్డిపల్లి, దాసరిపల్లి, కోటతిప్పల, గాయంవారిపల్లి, వేములపాడు గ్రామాల్లో బుధవారం ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, డీఏలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘ సభ్యులు రామ్మోహన్‌రావు, మాలకొండయ్య, సుబ్రహ్మణ్యం, హజరత్‌రెడ్డి, జి.రామక్రిష్ణ, ప్రసాద్, మహ్మద్ తదితరులుపాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

కొండపి: ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొండపిలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ముప్పరాజుపాలెం గ్రామానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై పొదిలి రోడ్డు నుంచి కొండపి బస్టాండ్ వైపు వస్తున్నాడు. అదే సమయంలో పనులు నిమిత్తం చోడవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు రోడ్డు దాటుతున్నాడు. రోడ్డు దాటుతున్న వెంకటేశ్వర్లును ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి ఢీకొనడంతో వెంకటేశ్వర్లు కిందిపడిపోయాడు. వెంకటేశ్వర్లు కు గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో కొండపి సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడ నుంచి ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించండి



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

కొండపి: గ్రామాల అభివృద్ధికి అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీఓ రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో బుధవారం అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న వనరులు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీరు తదితర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులను గుర్తించి నిధులు ఉన్నచోట వెంటనే పనులు ప్రారంభించాలన్నారు.

సింగరాయకొండ: ప్రభుత్వ పథకాలు సక్రమంగా అర్హులకు అందేలా చూడాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ జీవీ కృష్ణారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని, బోర్ల మరమ్మతులు గుర్తించి వెంటనే చేయాలని, గృహ నిర్మాణదారులు సకాలంలో గృహాలు నిర్మించుకునేలా కృషి చేయాలని, మహిళలకు పొదుపు సంఘాల ద్వారా బ్యాంకు రుణాలు అందజేసి ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ రమేష్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, ఏపీఎం భాగ్యలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ సుధీర్, హౌసింగ్ ఏఈ పృథ్వీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రిజ్వానా, సరిత పాల్గొన్నారు.

23న విద్యుత్ వినియోగదారుల సదస్సు

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు కాకతీయ కల్యాణ మండపంలో ఈ నెల 23వ తేది శనివారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ పాల్గొంటారన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కనులపండువగా గ్రామోత్సవం



కోదండరామ స్వామికి జలాధివాసం నిర్వహిస్తున్న భక్తులు

వీసీపల్లి: మండల పరిధిలోనే చిన్న వరిమడుగులో కోదండ రామస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా బుధవారం గ్రామోత్సవం కనులపండువగా సాగింది. ఈ సందర్భంగా విగ్రహాలకు మహాస్నానం, క్షీరాధివాసం, పుష్పాదివాసం, ధాన్యాదివాసం, సామూహిక కుంకుమార్చన, దీక్ష హోమం, శాంతి పౌష్టికా హోమం, మూల మంత్ర అనుష్టానాలు, విష్ణు సహస్ర నామ పారాయణము, అనంతరం మంగళహార దీక్ష ప్రసాదాలను అందజేశారు. భక్తులకు అన్న దానం చేశారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఏడీఏ నిర్మలకుమారి

కొండపి: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సింగరాయకొండ ఏడీఏ నిర్మలకుమారి అన్నారు. స్థానిక ఎరువులు పురుగుమందుల దుకాణాలను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గూడెంలోని స్టాకు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. రిజిస్టర్‌లో స్టాక్ వ్యత్యాసాలు డీబీటీ మిషన్ స్టాక్ రిపోర్ట్ పరిశీలించి రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వచ్చే లోడ్‌ను, అమ్మే ఎరువులను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. కల్తీ ఎరువులు, విత్తనాలు, లైసెన్సు లేకుండా అనధికారంగా విక్రయిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులంతా డీలర్ల దగ్గర ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. రైతులు ఎరువులను కొనుగోలు చేసేటప్పుడు అధిక ధర తీసుకుంటే వెంటనే సమాచారం అందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయ అధికారి మాల్యాద్రి, విస్తరణ అధికారి పి.కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులు ధ్రువీకరణ పత్రాలు పొందాలి

పొన్నలూరు: కౌలు రైతులు రైతు సేవా కేంద్రంలో తమ వివరాలను నమోదు చేసుకోని ధ్రువీకరణ పత్రాలను పొందాలని ఏఓ రాము అన్నారు. మండలంలోని రావులకొల్లు గ్రామంలో బుధవారం పలు వ్యవసాయ అంశాలపై రైతులకు, పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసే పంటల వివరాలను వ్యవసాయ సహాయకులకు తెలియజేసి నమోదు చేయించుకోవాలన్నారు. దీని ద్వారా ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలను, ఎరువులను, వ్యవసాయ పథకాలను పొందవచ్చన్నారు. అలాగే పశుపోషకులకు 75 శాతం రాయితీతో జొన్న విత్తనాలను అందజేస్తామన్నారు. అనంతరం పాడి రైతులకు జొన్న విత్తనాలను పంపిణీ చేశారు. వ్యవసాయ సహాయకుడు నాగమల్లేశ్వరరెడ్డి, పశు వైద్య సహాయకులు నవనీత, రైతులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత స్థాయికి ఎదగాలి



కేజీబీవీలో విద్యార్థుల స్టడీని పరిశీలిస్తున్న ఎంఈఓ కొండారెడ్డి

సీఎస్‌పురం(పామూరు): బాలికలను ఉన్నతస్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. స్థానిక కేజీబీవీ విద్యాలయం, గుమ్మనేనిపల్లి పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీబీవీలో విజయపథం కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలుచేయాలని ప్రిన్సిపాల్ రేష్మకు సూచించారు. చదువుల్లో వెనకబడిన విద్యార్థినుల కోసం ప్రత్యేక స్టడీ తరగతులు నిర్వహించాలని సూచించారు. ఐఐటీ చెన్నై వారి ద్వారా బోధిస్తున్న విద్యాశక్తి కార్యక్రమం ప్రతిరోజు విద్యార్థినులకు చూపించాలని, వారి అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. ఇంటర్మీడియెట్ విద్యార్థినులకు ల్యాబ్ సౌకర్యాన్ని సిద్ధం చేయాలని, వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ఇంటర్మీడియెట్ బాలికలకు ఒకేషనల్ సబ్జెక్టుల బోధన ప్రాక్టికల్స్ నిర్వహణపై శ్రద్ధ వహించాలని సూచించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ రేష్మ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్యాధికారికి రాష్ట్రస్థాయి పురస్కారం



అవార్డు అందుకుంటున్న డాక్టర్ సోమశేఖర్

టంగుటూరు: మండలంలోని సూరారెడ్డిపాలెం పశు వైద్య అధికారి డాక్టర్ సోమశేఖర్ రాష్ట్రస్థాయి పురస్కారాన్ని బుధవారం విజయవాడలో అందుకున్నారు. పశువుల్లో ఐవీఎఫ్ సరోగసి పిండ మార్పిడి విధానంలో దేశవాళీ మేలుజాతి ఒంగోలు, గిర్ జాతి దూడల ఉత్పత్తిలో చేసిన కృషికి, పశుసంవర్ధక శాఖలో ఉత్తమ సేవలకు రాష్ట్రస్థాయి పురస్కారాన్ని పశుసంవర్ధక శాఖ సంచాలకుడు డాక్టర్ దామోదర నాయుడు చేతుల మీదుగా డాక్టర్ సోమశేఖర్ అందుకున్నారు. రాష్ట్ర స్థాయి పురస్కారం రావడంపై టంగుటూరు సహాయ సంచాలకుడు డాక్టర్ సుధీర్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ దామోదరనాయుడు, అదనపు సంచాలకుడు డాక్టర్ సింహాచలం నాయుడు, రజనీకుమారి, రత్నకుమారి, చిన్నయ్య పాల్గొన్నారు.

271 పొగాకు బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో బేళ్ల తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని పెద్ద కండ్లగుంట, అయ్యప్ప రాజుపాలెం, నరసరాజుపాలెం చెందిన రైతులు 1106 బేళ్లను వేలానికి తీసుకురాగా 835 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 271 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.140, సరాసరి ధర రూ.242.42గా నమోదైంది. వేలంలో 24 కంపెనీలు పాల్గొన్నాయి.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో 195 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. క్లస్టర్ పరిధిలోని ఎం.నిడమానూరు గ్రామానికి చెందిన రైతులు 906 బేళ్లను తీసుకురాగా 711 బేళ్లను కొనుగోలు చేసి 195 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.140, సరాసరి ధర రూ.214.23గా నమోదైంది. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయి.

నేడు దివ్యాంగుల సమావేశం

కనిగిరిరూరల్: ప్రభుత్వం రీవెరిఫికేషన్ పేరుతో నోటీసులు ఇచ్చిన దివ్యాంగులతో గురువారం స్థానిక వికలాంగుల హక్కుల వేదిక కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ్ల మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న గురువారం ఉదయం 10 గంటలకు వికలాంగుల హక్కుల వేదిక కార్యాలయంలో జరిగే సమావేశానికి నోటీసులు అందుకున్న దివ్యాంగులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు



దీప్తిరెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి

మద్దిపాడు: ఇష్టంతో కష్టపడి చదివితే ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అన్నారు. నీట్ పీజీ పరీక్షా ఫలితాల్లో మద్దిపూడికి చెందిన ఇనుకొల్లు మాదిరెడ్డి, సుజాత మూడో కుమార్తె దీప్తిరెడ్డి ఉత్తమ ర్యాంక్ సాధించిన సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఏ వృత్తిలోనైనా ఇష్టంతో పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. గ్రామస్థాయిలోని పాఠశాలలో కష్టపడి చదివి నీట్ పీజీలోలో అత్యుత్తమైన ర్యాంక్ సాందించిన దీప్తిరెడ్డిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని తల్లి దండ్రులు, గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. అనంతరం దీప్తిరెడ్డిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ బి.జనార్దన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కే ఖాశింపీరా, డిప్యూటీ ఎంపీడీఓ నాగూర్‌వలి, ఎస్సై టి.రమేష్‌బాబు, ఎంఈఓ ఉయ్యాల శ్రీనివాసులు, ఏపీఓ జి.రాంబాబు, హౌసింగ్ ఏఈ భూపతి, తూగుట్ల నర్సారెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, సయ్యద్ షుఖూర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

పామూరు: సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్‌మౌలాలి, మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ పేర్కొన్నారు. పామూరులో బుధవారం మహాసభల ప్రచార పత్రాలను ఇంటింటా పంపిణీచేస్తూ విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకోకపోతే తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మహాసభలకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శులు పొలపర్తి మస్తాన్‌రావు, సూరిబాబు, వజ్రాల సుబ్బారావు, రఘునాథరెడ్డి, ప్రసాద్, వెంకట్‌రెడ్డి, దేవకుమార్, సురేష్ పాల్గొన్నారు.

సర్వేపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

నిగిరిరూరల్: రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే వ్యవసాయ ఉద్యోగులు, సిబ్బంది, సహాయకులు తప్పనిసరిగా ఈ పంట సర్వే(డిజిటల్ క్రాప్ సర్వే)పై అవగాహన కల్గి ఉండాలని సాంకేతిక వ్యవసాయ జిల్లా అధికారి బి.శ్రీనివాసనాయక్ అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం డిజిటల్ క్రాప్ సర్వే నమోదుపై శిక్షణ ఏడీఏ ఎస్‌కే జైనులాబ్దిన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ గ్రామంలో ప్రతి భూకమతమును ఈ పంట నమోదులోకి పొందుపర్చాలన్నారు. సెప్టెంబర్ 15 లోగా ఈ పంట నమోదును పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా రైతు సేవా కేంద్ర సిబ్బంది మార్కెఫెడ్ ద్వారా యూరియా నిల్వల ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరిలో ఒక బార్‌కు లైసెన్స్ అనుమతి

కనిగిరిరూరల్: నూతన మద్యం పాలసీ ప్రకారం కనిగిరి పట్టణానికి ఒక బార్ షాప్‌కు అనుమతి వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ ఆర్ విజయభాస్కర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కనిగిరి మున్సిపాలిటీకి సీరియల్ నెంబర్ పీకేఎం/ 2బీ/ 25, ఒక బార్‌ను కేటాయించారని తెలిపారు. దరఖాస్తుదారులు రూ.5 లక్షల నాన్ రీఫండ్‌బుల్ ఆఫికేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. లైసెన్స్ కాల పరిమితి 2025-2028 వరకు ఉంటుందని, ప్రతి ఏడాది 10 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. కనిగిరి బార్ లైసెన్స్ ఫీజు రూ. 35 లక్షలుగా నిర్ణయించినట్లు చెప్పారు. ఒంగోలు అంబేద్కర్ భవన్‌లో ఈనెల 28న లాటరీ డ్రా తీస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు దరకాస్తు చేసుకోవాలని కోరారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

కనిగిరిరూరల్: ఎల్ఐసీ సంస్థను కాపాడాలని కోరుతూ ఏఓఐ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఎల్ఐసీ ఏజెంట్లు స్థానిక ఎల్ఐసీ శాటిలైట్ కార్యాలయ వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్, ఏఓఐ(సీఐటీయూ) నాయకులు మాట్లాడుతూ ఎస్ఐసీ సంస్థను కాపాడాలని, ఏజెంట్లను రక్షించాలని, కార్పొరేషన్ అంగీకరించిన డిమాండ్లను అమలు చేయాలని, జీఎస్టీని రద్దు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ 85 ఏళ్ల వరకు అమలు చేయాలని, అన్ని ఏజెంట్లకు మెడిక్లెయిమ్ సౌకర్యం కల్పించాలని, డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మేనేజర్ జీవీఎస్ సాయికుమార్‌కు అందచేశారు.